సబ్‌కలెక్టర్‌గా శౌర్యమన్ పటేల్

ప్రజాశక్తి-పాడేరు : పాడేరు సబ్ కలెక్టర్ గా 2022 ఐఎఎస్ బ్యాచ్ కు చెందిన శౌర్యమన్ పటేల్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ముందుగా మోద కొండమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఏ. ఎస్. దినేష్ కుమార్‌ను, జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎం జె అభిషేక్ గౌడ్, ఐటీడీఏ కార్యాలయంలో ప్రాజెక్టర్ అధికారి విభిషేక్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆ తరువాత కాఫీ హౌస్‌లో జరిగిన ఉపాధ్యాయ ఉపాధ్యాయ దినోత్సవంలో పాల్గొన్నారు.

పూల కుండీని ఇస్తున్న కలెక్టర్

పెరిగిన గోదావరి, శబరి

- భద్రాచలం వద్ద 45.5 అడుగుల నమోదు

- భయం గుప్పెట్లో విలీన మండలాల ప్రజలు

ప్రజాశక్తి-చింతూరు

ఉపరితల ఆవర్తనం, అల్పపీడనం ఒకదాని వెనుక మరొకటి వెంట వెంటనే రావడంతో తెలుగు రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరిలో వరద ఉధృతి పెరుగుతోంది. భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక దాటి ప్రమాద స్థాయిలో గోదావరి నది ప్రవహిస్తుంది. భద్రాచలం వద్ద గోదావరి నీటి మట్టం బుధవారం సాయంత్రానికి 44.1 అడుగుల ఉండగా, గురువారం సాయంత్రం 6 గంటల సమయానికి 45.1 అడుగులకు స్వల్పంగా పెరిగింది. తెలంగాణ రాష్ట్రంలో కురిసిన వర్షాలకు తాలిపేరు కాలేశ్వరం, దుమ్ముగూడెం ప్రాజెక్టుల్లో నీరు భారీగా చేరి గోదావరి నదికి చేరటంతో భద్రాచలం రామాలయం చుట్టుపక్కల ప్రాంతాలు ముంపనకు గురయ్యాయి. 9.84.082 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల అవుతుంది. గోదావరి, అల్లూరి జిల్లాలోని వాగులు ఎగపోటుతో చింతూరు వద్ద శబరి నది నీటిమట్టం 30 అడుగులకు చేరింది. చింతూరు, విఆర్ పురం రెండు మండలాలకు మధ్య సూటూరు వద్ద సోకులేరు వాగు ఉధృతంగా ప్రవహించటంతో గత నాలుగు రోజుల నుండి సుమారు 50 గ్రాముల ప్రజలకు రాకపోకలు నిలిచిపోయాయి. ఇప్పటికే నాటు పడవలు అధికారులను ఏర్పాటు చేశారు.

విఆర్.పురం : గోదావరి, శబరి నదులు పొంగటంతో ముంపు మండలాల ప్రజలు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. మండలంలో చిన్నమట్టపల్లి పంచాయతీ పరిధి కన్నయ్య గూడెం గ్రామం చుట్టూ వరద చేరడంతో ఎటు వెళ్లలేని స్థితి నెలకొంది. వడ్డిగూడెం, శ్రీరామగిరి, రామవరం, అడవి వెంకన్నగూడెం, చింతరేగుపల్లి తదితర గ్రామాల్లో రోడ్లపైకి వరద చేరడంతో విఆర్ పురం మండల కేంద్రానికి సుమారు 30 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. నిత్యవసర సరుకులు కోసం మండల కేంద్రానికి రావాలంటే నానా ఇబ్బందులు పడాల్సి వస్తుందని, నాటు పడవలు ఏర్పాటు చేయాలని వరద బాధితులు కోరుతున్నారు. పునరవాస కేంద్రాలకు వెళ్ళటానికి సామాన్లు సర్దుకొని ఉన్నామని, పడవలు అందుబాటులో లేకపోవడంతో నడుము లోతులో నుండి ఉన్న నీటిలో సామాన్లు మోసుకొని వస్తున్నామని బాధితులు తెలిపారు.

కూనవరం : భారీ వర్షాలకు మళ్ళీ గోదావరికి వరద పోటెత్తడంతో ముంపు మండలాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. మళ్ళీ వరద రావడంతో సామాన్లు సర్దుకొని దయనీయంగా పరుగులు పెడుతున్నారు. ఇప్పటికే మురుమూరు ప్రాంతాల్లోని రోడ్డుపైకి నీరు చేరడంతో భద్రాచలానికి కూనవరం మధ్య రాకపోకలు నిలిచిపోయే అవకాశం ఉంది. ఇంకా పెరిగితే లోతట్టు ప్రాంత ప్రజలు గుట్టల పైకి వెళ్లి తలదాచుకోవాల్సిన పరిస్థితి రానుంది. ఇప్పటికే కొంతమంది రైతులు మిర్చి పంట వేయగా అవి గోదావరి వరదకు దెబ్బతిన్నాయి.

చింతూరు మండలం సోకులేరు వద్ద అధికారులు సిద్ధం చేసిన పడవ

నిత్యావసరాలు, బరకాలు, దోమ తెరలు పంపిణీ చేయాలి

కూనవరం : వరదలు కారణంగా ఇబ్బంది పడుతున్న బాధితులకు నిత్యావసర సరుకులు, బరకాలు, దోమ తెరలు పంపిణీ చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వర్షాలు, వరదల కారణంగా వ్యవసాయ కూలీ పనులు, ఉపాధి హామీ పనులు లేక కూలీలు అర్ధాకలితో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అపారిశుద్ధ్యం, కలుషిత నీరు వల్ల ప్రజలు రోగాల బారిన పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. తక్షణమే నిత్యవసర సరుకులతో పాటు 25 కేజీల బియ్యం ప్రతి కుటుంబానికి టార్పాలిన్, దోమతెరలు అందించాలని కోరారు. ఈ సమావేశంలో గిరిజన సంఘం మండల కార్యదర్శి బాబు బొర్రయ్య, సిపిఎం నాయకులు తాళ్లూరు శ్రీనివాసరావు, కొండా ఈశ్వర్లు, మహిళా నాయకురాలు సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : తహశీల్దార్

ఎటపాక : వర్షాలు, వరదల నేపథ్యంలో ప్రజల అప్రమత్తంగా ఉండాలని ఎడపాక తహశీల్దారు పృథ్వీ గురువారం ఒక ప్రకటనలో ప్రజలకు సూచించారు. అస్నా తుఫాన్ కారణంగా రాబోవు 24 గంటలలో భారీ నుండి అతి భారీ వర్షాలు పడతాయని, గోదావరి వరద పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లోనే బయటకు వెళ్లాలని, చేపల వేటకు వెళ్ళకూడదని, కరెంట్ స్థంబాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఏదైనా ఇబ్బంది కలిగితే కంట్రోల్ రూమ్ 9121108465, 9849576639 నెంబర్లకు తెలియజేయాలని కోరారు.

ఒడ్డుగూడెం నుంచి సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్తున్న బాధితులు

పొంగి పొర్లుతున్న కొండ వాగులు

పొంగిపొర్లుతున్న బొడ్లంక పెండ్లి రేవు వాగు

మారేడుమిల్లి : మండలంలో వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయి. రహదారులు, కల్వర్ట మీద నుండి వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ఇరువైపులా వాహనాలు ఎక్కడికక్కడే ఆగిపోయి ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. మండలంలోని బొడ్లంక గ్రామ సమీపన ఉన్న పెళ్లి రేవు కాలువ ఉప్పొంగడంతో ఎగువ ప్రాంతమైన పాతకోట, ధారగడ్డ, గుర్తేడు సుమారుగా 5 పంచాయతీల ప్రజలకు రాకపోకలు నిలిచిపోయాయి. అత్యవసర సమయంలో అంబులెన్స్ రావడానికి కూడా అవకాశం లేదు. పుల్లంగి పంచాయతీ చిలక వీధి గ్రామ సమీపంలో ఉన్న కొండవాగు కల్వర్టుపై ఉధృతంగా ప్రవహిస్తుండడంతో లోతట్టు ప్రాంత ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. నిత్యవసర సరుకుల కొనుగోలకు వాగు దాటుతూ నరకయాతన పడుతున్నారు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలెవరు వాగులు దాటవద్దని పోలీస్, రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది ప్రజలకు సూచిస్తున్నారు.

దోమ తెరలు పంపిణీ చేస్తున్న సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సత్యనారాయణ, వైద్య సిబ్బంది

నిత్యావసరాలు, దోమతెరలు పంపిణీ

ప్రజాశక్తి-విఆర్.పురం

మండలంలో ముంపునకు గురైన చిన్నమట్టపల్లి పంచాయతీ పరిధి కన్నయ్య గూడెం గ్రామస్తులు పడుతున్న ఇబ్బందులను తెలుసుకొని సిపిఎం నాయకులు అధికారులతో మాట్లాడి వారికి నిత్యవసర సరుకులు, దోమతెరలను సిపిఎం జిల్లా నాయకులు పూనెం నారాయణ, మండల కార్యదర్శి సోయం చిన్నబాబు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత పది రోజులుగా కన్నాయగూడెం గ్రామం చుట్టూ వరద చేరిందని వారికి ఎటు వెళ్ళా లేని పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. కార్యక్రమంలో మడకం రాజు, మడకం కన్నారావు, పూనం రాముడు, మొట్టు కన్నయ్య, ఆశ వర్కర్ లక్ష్మి, మిడియం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మండలంలోని మొద్దులగూడెం గ్రామంలో తహశీల్దారు సుబ్బారావు, రాయిగూడెం ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్ చేతుల మీదుగా దోమతెరలు పంపిణీ చేశారు. జీడిగుప్ప పంచాయితీ తుమ్మిలేరు, కొల్లూరు, కొండెపూడి గ్రామాల ప్రజలకు కూరగాయలు తరలించారు. శ్రీరామగిరి గ్రామంలో చుట్టూ వరద చేరడంతో ప్రజలు గుట్టలపై గుడారాలు వేసుకొని ఉన్నారు. వారికి ఎటు వెళ్లడానికి అవకాశం లేకపోవడంతో ముందు జాగ్రత్త చర్యగా తహశీల్దారు సుబ్బారావు కూరగాయలు పడవలపై తీసుకువచ్చి పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు సోడి మల్లయ్య, కే సత్యనారాయణ, జి లక్ష్మణరావు, వార్డు మెంబరు రవివర్మ, ఉప సర్పంచ్ దుర్గారావు, ఆర్ఐ రామకృష్ణ, వీఆర్ఒ, విఆర్ఎ పాల్గొన్నారు.

మండలంలోని రామవరం పంచాయతీ పరిధి అడవి వెంకన్న గూడెం గ్రామంలో ఎంపీపీ కారం లక్ష్మి చేతుల మీదుగా నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు కారం సుందరయ్య, సుధీర్ ప్రజలు పాల్గొన్నారు..

నాటు పడవపై కూరగాయలు తరలింపు

విఆర్.పురం : మండలంలోని రామవరం పంచాయతీ పరిధి రామవరం పాడు, రామవరం, అడవి వెంకన్న గూడెం, సోపల్లి గ్రామాలకు వెళ్లే రహదారులు ముంపునకు గురయ్యాయి. దీంతో వారు విఆర్.పురం మండల కేంద్రానికి వచ్చే పరిస్థితి లేకపోవడంతో విషయం తెలుసుకున్న రామవరం గ్రామ కార్యదర్శి తాతారావు తహశీల్దారు కార్యాలయం నుండి కూరగాయలు తీసుకొని వాహనంపై కూనవరం చేరుకొని అక్కడనుండి నాటు పడవలపై ఆయా గ్రామాలకు తరలించి పంపిణీ చేశారు. కార్యక్రమంలో వీఆర్వో, సచివాలయం, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉల్లిపాయలు, బంగాళ దుంపలు పంపిణీ చేస్తున్న ఎంపిపి కారం లక్ష్మి, సిపిఎం నాయకులు

పాత్రలను ఖాళీ చేస్తున్న డిఎం అండ్ హెచ్ఒ

డెంగీ ప్రబలకుండా ముందస్తు చర్యలు

ప్రజాశక్తి -పాడేరు : డెంగ్యూ వ్యాధి వ్యాప్తిని అరికట్టాలని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పాడేరులో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది తక్షణ చర్యలు చేపట్టారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి జమాల్ బాషా, జిల్లా మలేరియా అధికారి ప్రసాద్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రం పాడేరులో గురువారం మినుములూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది 8 బృందాలుపాడేరు పట్టణంలో మొదటిరోజు ఎనిమిది వీధుల్లోని ప్రతి ఇంటికి వెళ్లి వాటర్ డ్రమ్ములు ,పూల కుండీలు, టైర్లు, వాటర్ బాటిల్స్ వంటి వాటిని నిశితంగా పరిశీలించి లార్వా ఉన్నచోట దాన్ని పొడి ప్రాంతంలో పారబోసి నిర్మూలన చేశారు. ఏంటి లార్వా ఆపరేషన్ లో భాగంగా ఎబెట్ మందును పిచికారి చేపట్టారు.ఈ సందర్భంగా పాడేరు పట్టణ ప్రజలకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జమాల్ భాష అవగాహన కల్పిస్తూ డెంగ్యూ వ్యాధిపై ప్రజల్లో అవగాహన ఉండాలన్నారు. ప్రజల సహకారం లేనిదే డెంగ్యూ వ్యాధిని నివారించలేమన్నారు. ఈ కార్యక్రమంలో మలేరియా యూనిట్ ఏఎంవో శేషయ్య, ఎస్‌యుఒ ధనుంజయ్, హెల్త్ అసిస్టెంట్స్ జేవి చలం, శెట్టి నాగరాజు, పడాల్ ,లక్ష్మణ్, శంకర్, వై.వి.రమణ, నాగరాజు, ఎలీషా ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

నేల కొరిగిన పంటలను పరిశీలిస్తున్న నాయకులు

రైతులకు నష్ట పరిహారం ఇవ్వాలి

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: భారీ వర్షానికి పంట నష్ట పోయిన రైతులకు నష్ట పరిహారం ఇవ్వాలని ఆదివాసి గిరిజన సంఘం మండల కార్యదర్శి గత్తుం బుజ్జిబాబు డిమాండ్ చేశారు. మండలంలోని గురువారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షాలకు బొండం పంచాయతీ కరకవలస, బలియగూడ, గ్రామాలకు చెందిన 20 ఎకరాలు పంట పొలాలు నీటి మునిగిందన్నారు. నఆష్టపోయిన పంటపొలాలు పరిశీలించారు.అనంతరం ఆదివాసి గిరిజన సంఘం మండల కార్యదర్శి గత్తుం బుజ్జిబాబు మాట్లాడుతూ, పొలాలు నేల మట్టం అవడంతో రైతులు తీవ్రంగా నష్ట పోయారన్నారు.ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం మండల నాయకులు కిల్లో బుజ్జి బాబు, గుబ్బయి మల్లేష్, సుబ్బారావు, రైతులు గుబ్బయి అయితన్న గుబ్బయి, భీమన్న, గుబ్బాయి తాతన్న, గుబ్బాయి రామన్న, గుబ్బయి మొస్య పాల్గొన్నారు.

సమాజ శ్రేయస్సుకు విద్యార్థులను తీర్చిదిద్దండి

- ఉపాధ్యాయులకు జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ ఉద్బోధ

ప్రజాశక్తి-పాడేరు : విద్యార్థులను సమాజానికి ఉపయోగపడే విధంగా తీర్చి తీద్దాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ ఉపాధ్యాయులకు ఉద్బోధించారు. స్థానిక కాఫీ హౌస్‌లో విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లాస్థాయిలో గురుపూజోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిధిగా పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ,ఉపాధ్యాయుడు సమాజ అభివృద్ధికి మూల పురుషుడని, సమాజ బాగుకు ఒక ఆయుధమని తెలిపారు. ఉపాధ్యాయుడు అందరికీ ఆదర్శంగా ఉన్నందునే వారికి ఎప్పటికీ గౌరవం ఉంటుందన్నారు. పూర్వకాలంలో ఉపాధ్యాయుడు చెప్పిందే వేధమని, వారు చెప్పినట్లే విద్యార్థులు నడుచుకునే వారని, కాలానుగుణంగా వచ్చే మార్పులు కొంత ప్రభావాన్ని తీసుకు వచ్చాయని చెప్పారు. విద్యార్థుల అభిరుచి, వారి ఆలోచనలకు అనుగుణంగా ఉపాధ్యాయులు అప్ గ్రేడ్ కావాలని, భోధన ప్రత్యేకంగా ఉండాలని సూచించారు. టీచింగ్ మెథడాలజిలో మార్పు రావాలని, విశ్లేసనాత్మకంగా భోధన ఉండాలని, పిల్లలలో కాన్ఫిడెన్స్ మెరుగు పరచి భయం పోగొట్టాలని సూచించారు. సెప్టెంబర్ ఐదున తన గురువులకు ఫోన్ చేసి మాట్లాడడం జరుగుతుందని చెప్పారు. మార్గదర్శిని పేరుతో ప్రతి పాఠశాలలో వారానికి ఒక గంట పాటు విద్యార్థుల భవిష్యత్తు, కెరీర్ గూర్చి వారికి అవగాహన కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నామని, అందుకు అవసరమైన మేధావులను అన్వేషిస్తున్నామని చెప్పారు. జిల్లా పరిషత్ చైర్పర్సన్ జే.సుభద్ర మాట్లాడుతూ, సమాజంలో ప్రస్తుతమున్న గొప్పవారందరూ ఉపాధ్యాయులు తయారు చేసిన రాత్నాలేనని గుర్తు చేసారు. అంతటి ఆదర్శం, విలువలు ఉన్నది ఉపాధ్యాయ వృత్తి మాత్రమేనని కొనియాడారు. విద్యార్థులకు క్రమశిక్షణతో పాటు ఓర్పు, సహనం, సుగుణాలు నేర్పించాలన్నారు.

ఎస్పీ అమిత్ బర్థార్ మాట్లాడుతూ, విద్యార్థులలో పెద్ద పెద్ద కలలు కల్పించాలని, అవి సాకారమయ్యే విధంగా ఉపాధ్యాయులు తర్ఫీదు ఇవ్వాలన్నారు. విద్యార్థులలో ఉన్న సృజనాత్మకతను గుర్తించి వారిని నైపున్యవంతులుగా తీర్చి దిద్దాలన్నారు.

సంయుక్త కలెక్టర్ డా. ఎంజే అభిషేక్ మాట్లాడుతూ, క్రమశిక్షణ, నైతిక విలువలుతో కూడిన విద్యనందించాలని సూచించారు. ఐ టి డి ఎ ప్రాజెక్ట్ అధికారి అభిషేక్ మాట్లాడుతూ, పిల్లల అభివృద్ధిని చూసి సంతోషించే ఒకే ఒక వ్యక్తీ ఉపాధ్యాయుడని తెలిపారు. అరకు శాసన సభ్యులు రేగం మత్స్యలింగం మాట్లాడుతూ పిల్లలలో లోపాలను, వెనుకబాటు తనాన్ని గుర్తించి వారు విద్యలో ఎదిగేలా నైపుణ్యతతో కూడిన విద్యను అందించాలని సూచించారు. ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్, డిఆర్ఓ బి.పద్మావతి, డిఇఓ పి. బ్రహ్మాజీ, గిరిజన సంక్షేమ ఉప సంచాలకులు ఐ కొండలరావు, పలువురు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సర్వేపల్లి చిత్ర పటానికి పూలమాల వేస్తున్న కలెక్టర్

పౌష్టికాహారంతో ఆరోగ్యం

ప్రజాశక్తి-హుకుంపేట: స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంలో గురువారం పౌష్టికాహార వారోత్సవాలు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సిడిపిఓ సిహెచ్ బాలమణి దేవి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఐసిడిఎస్ శాఖ పిడి ఎన్ సూర్యమణి, మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి ఆర్ వెంకటరావు పాల్గొన్నారు ఎంపీడీవో ఆర్ వెంకటరావు మాట్లాడుతూ, చిరుధాన్యాల ద్వారానే పౌష్టికాహారం లభిస్తుందని అన్నారు. ఐసిడిఎస్ పిడి సూర్యమణి మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు తీసుకోవలసిన ఆహారంపై అవగాహన కల్పించారు. మాతా శిశు మరణాలు తగ్గించేందుకు గ్రామ స్థాయిలో అంగన్వాడి టీచర్ కీలక పాత్ర పోషించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి కొమ్ము రమ, సర్పంచ్ వెంకటాపూర్ణిమ, ఇన్చార్జ్ ఏపిఎం వెంకటేశ్వర పాత్రుడు, ఆర్ఐ సీతమ్మ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అధికారులు

ఒంటెద్దు పోకడలతో మన్యంలో టిడిపి పరాజయం

ప్రజాశక్తి- చింతపల్లి : పాడేరు నియోజకవర్గంలో తెదేపా నాయకత్వం ఒంటెద్దు పోకడలకు పోవడంతోనే పాడేరు నియోజకవర్గం లో పరాభవం పొందాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆ పార్టీ సీనియర్ నాయకుడు, మండల ఉపాధ్యక్షుడు కిముడు లక్ష్మయ్య అన్నారు. మండలంలోని పెద బరడ పంచాయతీ లోతుగెడ్డ జంక్షన్‌లో ఆ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు బేరా సత్యనారాయణ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన లక్ష్మయ్య మాట్లాడుతూ, తెదేపా పాడేరు నియోజకవర్గ ఇన్చార్జ్, మాజీ శాసనసభ్యురాలు గిడ్డి ఈశ్వరి ఒంటెద్దు పోకడ వల్లనే పాడేరు నియోజకవర్గంలో తెదేపా చీలికలు, పీలికలుగా తయారైందన్నారు. తెదేపా ఆవిర్భావం నుండి క్రియాశీలక నాయకులుగా, కార్యకర్తలుగా ఉన్న వారిని విస్మరించి రాజకీయాలు చేయడం ఆమెకు తగదన్నారు. ఆమె అందర్నీ కలుపుకుపోయే మనస్తత్వాన్ని కలిగి ఉండాలన్నారు. ఇప్పటికైనా తీరు మార్చుకుని పార్టీ సీనియర్ నాయకులను, కార్యకర్తలను కలుపుకొని పోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ సీనియర్ నాయకులు పొత్తూరి. రాంబాబు, గడుతూరి రామరాజు, లకే. జోగిరాజు , కొత్తన్న నాయుడు, గొర్లె వెంకటరమణ, జనసేన నాయకుడు కేదారి రాజేష్ పాల్గొన్నారు.

పాల డబ్బాలు పంపిణీలో సురేంద్ర తదితరులు

పాల డబ్బాల పంపిణీ

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: మండలంలోని అరమ గ్రామానికి బి రాజారావు కుమార్తె దేవి గత నెల క్రితం మృతి చెందింది. ఆమెకు ఆరు నెలల చంటి పాప ఉంది. దీంతో అరకు సంత బయలు లోని యూనిట్ ఫర్ చారిటీ ట్రస్ట్ ఆ గ్రామంలో గురువారం సందర్శించి ఉచితంగా పాల డబ్బాలు పంపిణీ చేశారు. ఈ పాల డబ్బాలను ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర నేత కే సురేంద్ర, ఆ పంచాయతీ సర్పంచ్ కే ముల్ల అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, తల్లి కోల్పోయిన చంటి బిడ్డలకు రెండేళ్ల పాటు నెల నెల పాల డబ్బాలను ఉచితంగా యూనిట్ ఫర్ చారిట ట్రస్ట్ పంపిణీ చేయడం ఆనంద దాయకమన్నారు. ఆదివాసి ప్రాంతంలో అనేకమంది చిన్నారులు తల్లులకు దూరమై ఉన్నారన్నారని, అటువంటి వారిని కూడా గుర్తించి ట్రస్ట్ నిర్వాహకులు ఆయన కోరారు. గిరిజన సంఘం మండల కార్యదర్శి టి సూర్యనారాయణ, మండల నాయకులు టి రామారావు, కే రామకృష్ణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైద్య కళాశాల పనులు వేగవంతం చేయాలి

భవనాలు పరిశీలిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి-పాడేరు : వైద్యులు, వైద్య సిబ్బంది క్రమశిక్షణతో అంకితభావంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఎ.ఎస్ దినేష్ కుమార్ ఆదేశించారు. గురువారం ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ సమావేశ మందిరంలో మెడికల్ కాలేజీలోని వివిధ విభాగాల భోధన, భోధనేతర సిబ్బంది, హాస్పిటల్ సిబ్బందితో నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, మెడికల్ కళాశాల, ఆసుపత్రిలో ఖాళీల వివరాలపై ఆరా తీశారు. వైద్య పరీక్షలు సంబంధించిన యంత్ర పరికరాలు, వాటి పని తీరు, వైద్య పరీక్షలకు అవసరమైన పరికరాలు గూర్చి అడిగి తెలుసుకున్నారు. అనవసరంగా సెలవులు పెడితే సహించేది లేదని హెచ్చరించారు. ప్రతి వారం జాయింట్ కలెక్టర్ జిల్లా హాస్పిటల్ ని సందర్శించి పర్యవేక్షించాలని ఆదేశించారు. అంకిత భావం తో పనిచేసి గిరిజనులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. వైద్య సేవలలో నిర్లక్ష్యం వ్యహరించినా, రోగుల పట్ల అలసత్వం ప్రదర్శించినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పాడేరు మెడికల్ కళాశాల పనులు వేగవంతం చేయాలని, జిల్లా యంత్రాంగం తరఫున అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ పేర్కొన్నారు. గురువారం మెడికల్ కళాశాల పనులను పరిశీలించిన కలెక్టర్ నిర్మాణాల పట్ల సంతృప్తి వ్యక్త పరిచారు. సిమెంట్, ఇసుక కొరతను దృష్టిలో పెట్టుకుని వాటిని వెంటనే సరఫరా చేయాలని సంబంధిత యాజమాన్యాలకు ఆదేశించారు. మెడికల్ కళాశాల భవనంలో పూర్తి కాస్తున్న తరగతి గదులు, అనాటమీ, బయో కెమిస్ట్రీ, హిస్టాలజి ల్యాబ్, ఆఫీస్ గదులు, మ్యూజియం, డైనింగ్, వసతి గృహాలు తదితర నిర్మాణాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ నెలాఖరులోపు నిర్మాణాలు పూర్తి చేసి అక్టోబర్ ఒకటిన ప్రారంభానికి సిద్ధం చేయాలని ఎపిఎంఎస్ఐడిసి ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ ఎంజే అభిషేక్, కళాశాల ప్రిన్సిపాల్ హేమలత, ఆసుపత్రి మెడికల్ పర్యవేక్షకులు విశ్వమిత్ర, ఎపిఎంఎస్ఐడిసి కార్యనిర్వాహక ఇంజనీర్ అచ్చెం నాయుడు, డిఇఇ వర్మ, ఎఇఇ సురేష్, డిజిఎం మధుబాబు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు యూత్ త్రైక్వాండో క్రీడాకారులు

ప్రజాశక్తి -మధురవాడ : ఇటీవల విజయనగరంలో జరిగిన రాష్ట్రస్థాయి త్రైక్వాండో పోటీల్లో బంగారు పతకాలు సాధించిన మధురవాడ యూత్ త్రైక్వాండో క్లబ్ క్రీడాకారులు హర్షవర్ధన్, సుధీర్, గాయత్రి, హాసిని, మణికంఠ హిమాన్షు ఈ నెల 8 నుంచి 10 వరకు ఉత్తరప్రదేశ్ ఆగ్రాలో జరగబోయే జాతీయ పోటీల్లో పాల్గొంటున్నారని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర త్రైక్వాండో అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.అచ్చినాయుడు తెలిపారు. మధురవాడకు చెందిన కనకదుర్గ క్యాటరింగ్ అండ్ డెకరేషన్స్ ప్రొప్రైటర్ కోరాడ సురేష్ క్రీడాకారులను ప్రోత్సహిస్తూ పిఎస్,ఆర్ గ్రూప్ అండజేసారని యూత్ త్రైక్వాండో కోచ్ మకానా సురేశ్ తెలిపారు. విద్యార్థులు మరింతగా రాణించి, మరెన్నో పతకాలను సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జాతీయపోటీలకు ఎంపికైన క్రీడాకారులను, కోచ్ సుకుమార్, సంపత్‌లతోపాటు విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

15లోగా ఇ-క్రాప్ నమోదు పూర్తి

ప్రజాశక్తి -అనందపురం: మండలంలో ఇ-క్రాప్ నమోదును ఈనెల 15లోగా పూర్తిచేయాలని తహశీల్దార్ శ్యాంప్రసాద్, వ్యవసాయాధికారి సంధ్యారత్నప్రభ సూచించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రెవెన్యూ వ్యవసాయశాఖల అధికారులు, సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ, తహశీల్దార్ శ్యాంప్రసాద్ మాట్లాడుతూ, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను వేగవంతం చేయాలని, ఇంటింటికీ వెళ్లి ఓటర్ల జాబితాలో మార్పులు చేర్పులు, కొత్త ఓటర్ల నమోదు చేపట్టాలన్నారు. రీ సర్వే అధికారి శ్రీనివాసరావు, ఎంఆర్ఐ మణికంఠ పాల్గొన్నారు

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

రంపచోడవరంలో డేవిడ్ మాస్టారుకు సత్కరిస్తున్న కలెక్టర్, అధికారులు

ప్రజాశక్తి-రంపచోడవరం : జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు డేవిడ్ మాస్టారు ఎంపికయ్యారు. అల్లూరి జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్ చేతులు మీదుగా ఈ అవార్డును అందుకున్నారు. డేవిడ్‌కు ఆదర్శ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డి.టాల్ స్టాయి, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

యుటిఎఫ్ అభినందనలు

రంపచోడవరం : జిల్లా ఉత్తమ ఉపాధ్యాయు అవార్డు స్వీకరించిన హెచ్ఎం కేఆర్పి కుమార్, స్కూల్ అసిస్టెంట్ విష్ణు దొర, ఎస్జీటీ హెచ్ డేవిడ్ రాజుకు యుటిఎఫ్ మండల శాఖ అభినందనలు తెలియజేసింది. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు వై విల్సన్ బాబు, జిల్లా కార్యదర్శి జి విశ్వరాజు, మండల అధ్యక్షులు సిహెచ్ సనాతనబాబు, ప్రధాన కార్యదర్శి ఎన్ వెంగళరావు, గౌరవాధ్యక్షులు తాలుస్తాయి బాబు, డిపి పెద్ద లింగన్న పాల్గొన్నారు.

రాజవొమ్మంగి : ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను స్థానిక ఎంఆర్సి కార్యాలయంలో గురువారం ఘనంగా

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులకు యుటిఎఫ్ అభినందన

నిర్వహించారు, స్థానిక తాహశీల్దార్ కె.సత్యనారాయణ ఎంపీడీవో లోకుల యాదగిరిశ్వరరావు, ఎంఈఓ కే సత్యనారాయణ దొర, ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, స్థానిక సర్పంచ్ జి.రమణి తదితరులు చేతుల మీదుగా ఉత్తమ సేవలు అందించిన పలువురు ఉపాధ్యాయులకు మెమెంటోలు, ప్రశంస పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 సూరారెడ్డి, ఉపాధ్యాయులు పి.రమణ, ఎం రమేష్, నాగ సుశీల, బొజ్జయ్య, ఉదయ్, పైడిమల్లు, ప్రసన్న, వెంకటలక్ష్మి, మాజీ ఎంపీపీ టి.ప్రభ పాల్గొన్నారు.

అడ్డతీగల : మండలంలోని వీరవరం ఆశ్రమ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్న మఠం ఆనందబాబు ఉత్తమ ప్రధానోపాధ్యాయ పురస్కారం డీఈవో చేతుల మీదుగా అందుకున్నారు. అలాగే చిన్నం బాల వర ప్రసాద్, జి.తేజారావుకు డిఇఓ సేవ పురస్కారాలను అందించారు. ఉత్తమ ఉపాధ్యాయులకు ఏజెన్సీ డీఈవో మల్లేశ్వరరావు, ఎంఈఓ శ్రీనివాస్ అభినందనలు తెలిపారు.

మారేడుమిల్లి : ఏజెన్సీ డిఇఓ వై మల్లేశ్వరరావు చేతుల మీదుగా మండలానికి చెందిన ఉపాధ్యాయులు ఉత్తమ ఉపాధ్యాయ పురస్కరాలు అందుకున్నారు. పీజీహెచ్ఎం కేటగిరిలో మడకం రామారావు, స్కూల్ అసిస్టెంట్ కేటగిరిలో నీల్ ఆర్మ్ స్ట్రాంగ్, జెడ్‌పి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏ నీలయ్య, సెకండ్ గ్రేట్ టీచర్ కేటగిరి నుండిగ ఆశ్రమ బాలుర పాఠశాల తాడేపల్లి పి పెంటన్నదొర ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. వీరికి ఏజెన్సీ డీఈవో మలేశ్వరరావు, ఎంఈఓ తాతబ్బాయి దొర, యుటిఎఫ్ మండల అధ్యక్షులు డి మహేష్, ప్రధాన కార్యదర్శి కే కృష్ణారెడ్డి అభినందనలు తెలిపారు.

సీలేరు : జీకే వీధి మండలం సీలేరు పంచాయతీ పరిధి చింతపల్లి క్యాంపు ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు ఉపాధ్యాయులుగా తోటి విద్యార్థులకు ప్రతిభపాఠాలు చెప్పారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి ఉపాధ్యాయులు భగీరథ, విద్యార్థులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఉపాధ్యాయులను విద్యార్థులు సత్కరించారు. స్థానిక డిఏవి పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కాన్వెంట్, బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల, ఏపీ గురుకుల పాఠశాలలోనూ ఉపాధ్యాయ దినోత్సవాలు నిర్వహించారు.

డుంబ్రిగుడ:మండలంలో గురుపూజోత్సవాన్ని పలు పాఠశాలలో ఘనంగా గురువారం జరుపుకున్నారు. కిల్లోగుడ స్కూల్ కాంప్లెక్స్ లో ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయుడు ఎల్ వెంకట్రావును సాలువలతో సన్మానించారు. జూనియర్ కళాశాల, కేజీబీవీలో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులను అర్పించారు. జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ స్వామినాయుడు జ్యోతి ప్రజ్వాలన చేసి నివాళులను ఆర్పించారు బోడిగుడ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తూ ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన మోహనరావుకు గ్రామస్తులు, మండల విద్యాశాఖ అధికారి సుందర్రావు సన్మానించారు. గురు పూజోత్సవం సందర్భంగా విద్యార్థులు ప్రత్యేక దుస్తులను ధరించారు.

పెదబయలు :స్థానిక రెసిడెన్షియల్ పాఠశాల సమావేశ మందిరంలో ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖాదికారి కృష్ణమూర్తి, డేవిడ్, పుష్పలు సర్వేపల్లి సేవలను కొనియాడారు. పెదబయలు గురుకుల పాఠశాల జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల లో గురు పూజోత్సవం ఘనంగా నిర్వహించారు

అరకులోయ :స్థానిక సిఏహెచ్ స్కూల్ లో మండలంలోని ఉపాధ్యాయులందరూ గురు పూజోత్స వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంఈఓ త్రినాథ్ మాట్లాడుతూ, మానవుడు అంతరిక్షాన్ని శాసిస్తున్న నేటి యుగంలో గురువు పాత్ర కీలకమైనదని ఆయన అన్నారు. గతంతో పోలిస్తే ప్రస్తుత కాలంలో గురువులకు గౌరవం కరువుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని క్రమశిక్షణతో కూడిన నాణ్యమైన విద్యను అంకితభావంతో అభ్యసిస్తేనే ఉన్నత శిఖరాలు అధిరోహించ వచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో అరకులోయ ఎంఈఓ -2 భారతరత్నం, ఏటిడబ్ల్యూ మల్లికార్జున్‌రావు, హెచ్ఎంలు ఎల్.బి దయానిది, పద్మావతి, మోహన్‌రావు, నారాయణ, చిట్టిబాబు, అరకులోయ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ఎల్.బి వెంకటేశ్వరరావు, ప్రముఖ వ్యాపారవేత్త మయూరి రాజారావు, వర్తక సంఘం అధ్యక్షుడు కాపుగంటి కృష్ణారావు గురువుల ప్రాముఖ్యత, వశిష్టతను వివరించారు. అనంతరం . చిన్నారులు వేసిన నృత్య ప్రదర్శన అందర్నీ అమితంగా ఆకట్టుకుంది.ఎంఈఓలు వి.త్రినాథ్‌రావు, భారతరత్నం, ప్రభుత్వ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు మోహన్ రావులను సన్మానించారు.

డుంబ్రిగుడ మండల ఉపాధ్యాయున్ని సన్మానిస్తున్న అధికారులు

డుంబ్రిగుడ : మండల కేంద్రంలోని బాలుర గిరిజన ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అర్జున్, గుంటసీమ, బాలికల ఆశ్రమ పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్లు బీమరాజు, శైలాజ, బైలువలస ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు టి సుబ్బారావు ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. వీరిని గురువారం అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో జరిగిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను అందజేశారు.అవార్డులు అందుకున్న ఉపాధ్యాయులను ఉపాధ్యాయ సంఘాల నేతలు అభినందించారు.

కొయ్యూరు : మండలంలోని బూదరాళ్ల పంచాయతీ కన్నవరం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు సరమండ దిలీప్ కుమార్, విద్యా కమిటీ, గ్రామస్తుల ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయుడు జెబిబిపిఆర్ శర్మను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ ఎం.కేశవరావు, భాస్కరరావు, కామేశ్వరరావు, లక్ష్మి, జయ, వసంత, గ్రామస్తులు పాల్గొన్నారు.

కొయ్యూరు బూదరాళ్ల హెచ్‌ఎంను సత్కరిస్తున్న విద్యాకమిటీ

ముఖ్యమంత్రి సహాయ నిధికి విరాళం

ప్రజాశక్తి -పాడేరు: జిల్లాలోని స్వయం సహాయక బృందాల సభ్యులు ఐదు లక్షల రూపాయల విరాళాన్ని ముఖ్యమంత్రి సహాయనిధికి అందజేయవలసినదిగా కోరుతూ చెక్కు రూపంలో జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ కు అందజేశారు. ఇటీవల రాష్ట్రంలో సంభవించిన వరదలకు పలు జిల్లాలు జలమయమై పలువురు ప్రాణాలు కోల్పోయిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో జిల్లా మహిళా సమాఖ్య సభ్యులు స్పందించి ఐదు లక్షల రూపాయలను సేకరించి కలెక్టర్ కు అందజేశారు. గురువారం మెడికల్ కళాశాల ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో జేసి ఎంజే అభిషేక్, డిఆర్డిఎ పిడి వి.మురళి, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు దేవి, కార్యదర్శి భవాని, సభ్యులు కే. జయ, లక్ష్మి, చిన్నమ్మలు తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్ర డ్యాంలో గల్లంతైన వ్యక్తి మృతి

ప్రజాశక్తి - అనంతగిరి : చేపలవేటకు వెళ్లి విజయనగరం జిల్లా ఆంధ్ర డ్యాంలో గల్లంతయిన గిరిజనుడి మృతదేహం గురువారం లభ్యమైంది. మృతుని స్నేహితుల కథనం ప్రకారం.. అనంతగిరి మండలంలోని భీంపోలు పంచాయతీ బీటీగరు గ్రామానికి చెందిన గెమ్మెల భీమరాజు (22) ఆంధ్ర డ్యాంలో చేపలు పట్టేందుకు స్నేహితులతో కలిసి మంగళవారం రాత్రి వెళ్లాడు. వారంతా చెరో దిక్కున చేపల వేట ఆరంభించారు. కొంతసేపటికి బీమరాజు జాడ కనిపించలేదు. దీంతో ముగ్గురు స్నేహితులు ఆ రోజు రాత్రి చాలా సేపు గాలించినా ఫలితం లేకపోయింది. విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలిపారు. గురువారం భీమరాజు మృతదేహం డ్యాంలో కనిపించింది. ఆంధ్ర పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం విజయనగరం ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

హుండీ లెక్కింపులో పాల్గొన్న అధికారులు, గ్రామ పెద్దలు

దారాలమ్మ ఆలయం హుండీ లెక్కింపు

ప్రజాశక్తి - సీలేరు : జికె.వీధి మండలం దారాలమ్మ అమ్మవారి ఆలయం హుండీని గురువారం లెక్కించారు. మూడు నెలలుగా వచ్చిన ఉండి ఆదాయం దేవాలయ శాఖ యుఓ సాంబశివరావు, సూపర్వైజర్ తేజ, గ్రామ పెద్దలు ఆధ్వర్యంలో లెక్కించగా రూ.5,55,657 ఆదాయం వచ్చినట్లు ధ్రువీకరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు నడిగట్ల వరప్రసాద్, చంద్రిక, మాజీ ఎంపీటీసీ పోతురాజు గోవిందు, పోతురాజు కృష్ణ, వెంకటేశ్, గొర్ల ఉమామహేశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు మల్లు దొర తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి-రంపచోడవరం : రంపచోడవరంలో విద్యుత్ లైన్లకు దగ్గరగా ఉన్న చెట్లు కొమ్మలు తొలగింపు పనుల నేపథ్యంలో రంపచోడవరం, సిరిగిందలపాడు గ్రామాలకు శుక్రవారం ఉదయం 8 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని విద్యుత్ శాఖ ఇఇ యండి.యూసఫ్ గురువారం ఒక ప్రకనటలో కోరారు.

రాజవొమ్మంగి : జాతీయ రహదారి విస్తరణలో భాగంగా విద్యుత్ లైన్లకు దగ్గరగా ఉన్న చెట్ల కొమ్మలు తొలగించే ప్రక్రియ జరుగుతున్న నేపథ్యంలో శుక్రవారం రాజవొమ్మంగి మండల పరిధిలోని అన్ని గ్రామాలకు ఉదయం 8 నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని, కావున విద్యుత్ వినియోగదారులు సహకరించాలని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎండి యూసఫ్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ దివాకర్ కోరారు.

50 కేజీల చొప్పన రాజ్‌మా విత్తనాలు అందించాలి

ప్రజాశక్తి - సీలేరు : గిరిజన రైతులకు 50 కేజీలు చొప్పున రాజ్‌మా విత్తనాలు పంపిణీ చేయాలని సిపిఎం గాలికొండ ఎంపీటీసీ అంపరంగి బుజ్జిబాబు డిమాండ్ చేశారు. స్థానిక విలేకరులతో ఆయన గురువారం మాట్లాడుతూ 10 కేజీలు చొప్పున రాజ్మా విత్తనాలు ఇచ్చి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ప్రభుత్వం చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రభుత్వం, పోలీస్ శాఖ గిరిజనులు చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, గంజాయి సాగు అక్రమ రవాణా నేరమని, ఆ పంటలు విరమించాలని పదేపదే అవగాహన సదస్సులు ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. గంజాయి పంటలు నిలిపివేస్తే ప్రత్యామ్నాయంగా ప్రభుత్వం నుంచి కావలసిన విత్తనాలు సరఫరా చేయడం లేదన్నారు. ఒక్కో రైతుకు కనీసం 50 కేజీలు విత్తనాలు ఇవ్వకపోతే రైతు ఆర్థికంగా నిలదొక్కుకోవడం కష్టమని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం, పోలీసులు, అగ్రికల్చర్ అధికారులు గిరి రైతులకు అధిక శాతం విత్తనాలు సరఫరా చేసి ఆర్థికంగా ఆదుకోవాలని బుజ్జిబాబు కోరారు.

ఆరో తరగతి విద్యార్థి మట్టి వినాయక విగ్రహాల తయారీ

ప్రజాశక్తి-మోతుగూడెం : చింతూరు మండలం మోతుగూడెం గ్రామంలో ఏపీ జెన్కో డిఏవి ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో ఆరవ తరగతి ఎం నాగబాబు పర్యావరణహిత వినాయక మట్టి విగ్రహాలను తయారు చేసి అందరి మన్నలను పొందుతున్నాడు. వినాయక చవితి పండుగకు ప్రతి ఒక్కరూ మట్టి విగ్రహాలను తయారుచేసి పూజించాలని ఆ చిన్నారి చెబుతున్నాడు.

తిరుపతి లడ్డు విక్రయాలు ప్రారంభం

ప్రజాశక్తి-రంపచోడవరం : మండలంలోని ఐ.పోలవరం గ్రామ సమీపంలోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో తిరుపతి తిరుపతి వెంకటేశ్వర స్వామి లడ్డు ప్రసాదాన్ని గురువారం నుండి విక్రయాలను రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తిరుమల తిరుపతి దేవస్థానం నుండి వచ్చిన లడ్డూలను ఇక నుంచి ఐ పోలవరం వెంకటేశ్వర స్వామిలో అందుబాటులో ఉంటాయని తెలిపారు.

విఓఎలకు వేతన బకాయిలు విడుదల చేయాలి

ఐటిడిఎ వద్ద ఆందోళన

ప్రజాశక్తి-రంపచోడవరం

డ్వాక్రా సంఘాలను ఆర్గనైజ్ చేస్తున్న వెలుగు వివోఏలకు ఈ ఏడాది మార్చి నెల నుంచి నేటి వరకు ఆరు నెలలుగా బకాయి పడ్డ వేతనాలను తక్షణమే విడుదల చేయాలని కోరుతూ ఏపీ వెలుగు వివోఏ (యానిమేటర్స్) ఉద్యోగుల సంఘం (సిఐటియు) ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఐటిడిఎ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. దీనికి ముందు సిఐటియు కార్యాలయం నుండి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ రంపుచోడవరం జిల్లా అధ్యక్షులు మట్ల వాణిశ్రీ, జిల్లా ఉపాధ్యక్షుడు కె.శాంతిరాజు, వెలుగు యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి అరగటి రామకృష్ణ మాట్లాడుతూ ఆరునెలలుగా జీతాలు చెల్లించకపోతే వారు ఎలా జీవిస్తారని ప్రశ్నించారు. అనేక సార్లు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఐటీడీఏ వద్ద ఆందోళనలు చేసినా పట్టించుకోలేదన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి మూడు నెలలు దాటిన నేటికీ సమస్యలు పట్టించుకోలేదని ఆరోపించారు. సమస్యలు పరిష్కారం చెయ్యక పొగ రాజకీయ కక్షసాధింపుగా వందల మంది వెలుగు యానిమేటర్స్ కూటమి ప్రభుత్వం తొలగించడం సరైన పద్ధతి కాదన్నారు. ప్రమాద బీమా 10 లక్షలు కల్పించాలని, గత ప్రభుత్వం ఇచ్చిన మూడు సంవత్సరాల కాల పరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఆందోళన చేస్తున్న వెలుగు యానిమేటర్స్ వద్దకు ఐటీడీఏ ఏఒ, వెలుగు ఎపిడి వచ్చి ఐదు రోజులలో వేతనాల సమస్యలను పరిస్కారం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ లోగా సమస్యలు పరిస్కారం చెయ్యకపోతే ఈ నెల 16 నుండి విధులను నిలుపుదల చేసి పెద్ద ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

వినతిపత్రం అందజేస్తున్న వాణిశ్రీ, విఓఎలు

ఈ కార్యక్రమంలో వెలుగు యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు జి.వరుణ్, బసిరమ్మ, జిల్లా సహాయక కార్యదర్శి చందు, నరసింహ, సుబ్బలక్ష్మి, మంగయమ్మ, కృష్ణకుమారి, సత్యనారాయణ. భవాని, 300 మంది వెలుగు యానిమేటర్స్ పాల్గొన్నారు.

క్లిష్టంగా కూటమి ప్రభుత్వ ఇసుక విధానం

మాట్లాడుతున్న క్వారీ లారీల యజమానుల సంఘం నాయకులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రాష్ట్రంలో తెలుగుదేశం నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా ఇసుక లభ్యత క్లిష్టంగా మారిందని, తక్షణం విశాఖలో ఇసుక రీచ్‌లు ఏర్పాటు చేయాలని విశాఖ జిల్లాలోని ఐదు క్వారీ లారీల యజమానుల సంఘాల నాయకులు అన్నారు. గురువారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో విశాఖపట్నం క్వారీ లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి కర్రి వెంకట రమణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉచిత ఇసుక విధానం ప్రవేశపెట్టిందన్నారు. అయితే ఇసుక లభ్యత ఉండటం లేదన్నారు. అందువల్ల లారీల యజమానులుగా తాము, తమతో పాటు కార్మికులు ఉపాధి లేక అవస్థలు పడుతున్నామని తెలిపారు. బ్లాక్ మార్కెట్ పెరిగిందన్నారు. ఉచిత ఇసుక బూటకమని తెలిపారు. వినియోగదారులపై టన్నుకు రూ.3500 భారం పెరిగిందన్నారు. విశాఖ జిల్లాలో క్వారీ రీచ్‌లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. సుమారు వెయ్యి లారీలతో ఇసుక రవాణా జరుగుతోందని, ఇసుక రవాణా చేస్తూ పది వేల కుటుంబాలు జీవనం కొనసాగిస్తున్నారని తెలిపారు. సంఘం అధ్యక్షులు మద్దిల వెంకటరమణ మాట్లాడుతూ రాష్ట్రంలో ఇసుక సరఫరా బంగారం అన్న చందంగా ఉందన్నారు.

ఐదు రకాల పాలసీల వల్ల ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. 2019 -2021 కాలంలో కూడా సిఎం జగన్ మోహన్ రెడ్డి చంద్ర బాబు మాదిరి విధానమే అమలు చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో శ్రీ సింహాద్రి లారీ ఒనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు బంక శ్రీను, విశాఖ పట్నం లారీ ఆపరేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు పెదిరెడ్ల లక్ష్మీనారాయణ, బొట్టా సురేష్, కొయ్య శ్రీను, శ్రీనివాసరావు, భాస్కరరావు, కె.అర్జునరావు, కోరాడ శ్రీను, రెడ్డి శ్రీరాములు, బి.రాంబాబు, ఎస్.జగ్గారావు పాల్గొన్నారు.

గృహ నిర్మాణ సామగ్రి వితరణ

ప్రజాశక్తి-కూనవరం : భారీ వర్షాలు, ఈదురు గాలులకు కూనవరం మండలంలోని ఉదయ భాస్కర్ కాలనీలో ఇంటి రేకులు పగిలిపోవడంతో జమాల్ ఖాన్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యాన గృహ నిర్మాణ సామగ్రిని అందించారు. దెబ్బతిన్న పి.శ్రీను, ఎడ్ల ముత్యం, గార్ల ఈశ్వరమ్మ మూడు గృహాలకు సిమెంట్ రేకులు, ఇనుప పైపులు అందజేశారు. వారికి బియ్యం కూడా పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు సూఫీ, ఎడవల్లి భాస్కర్, చిన్నారెడ్డి, పొడియం అప్పారావు, ఉమామహేశ్వరరావు, ప్రకాష్ ,వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పులి సంతోష్ కుమార్

ఉచితంగా డిఎస్‌సి, టెట్ మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి-చింతూరు : రంపచోడవరం, చింతూరు, డివిజన్‌ల పరిదిలోని టెట్, డిఎస్‌సి సిద్ధమవుతున్న అభ్యర్థులకు ప్రముఖ కోచింగ్ సెంటర్ల అధినేత, ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావుతో తయారు చేయబడిన మెటీరియల్‌ను ఉచితంగా పంపిణీ చేస్తామని ఎపి ఆదివాసి గిరిజన సంఘం రంపచోడవరం జిల్లా పులి సంతోష్ కుమార్ తెలిపారు. గురువారం చింతూరులో జరిగిన సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో ఎంతోమంది గిరిజన, గిరిజనేతర మధ్యతరగతి నిరుద్యోగులు డీఎస్సీ కోసం గత పదేళ్లుగా ఎదురు చూశారని తెలిపారు. కోచింగ్ సెంటర్లకు వెళ్లి వేల రూపాయలు చెల్లించి నెలల సమయం వెచ్చించి కోచింగ్ తీసుకునే స్థోమత లేని రంపచోడవరం, చింతూరు డివిజన్ల నిరుద్యోగ యువతకు ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు రూపొందించిన అద్భుతమైన మెటీరియల్‌ను ఉచితంగా అందిస్తామని చెప్పారు. దీనిని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మెరిటీయల్ కావాల్సిన వారు వాట్సాప్ నెంబర్ ద్వారా తమ పేర్లను సెప్టెంబర్ 10వ తేదీ లోగా నమోదు చేసుకోవాలని సూచించారు. సంప్రదించవలసిన నెంబర్లు పులి సంతోష్‌కుమార్ జిల్లా ప్రధాన కార్యదర్శి 9849029243, ఈతపల్లి సిరిమల్లి రెడ్డి జిల్లా అధ్యక్షులు 6304642284, కాక అర్జున్‌దొర రాష్ట్ర కమిటీ సభ్యులు 8106633437, సీసం సురేష్ జిల్లా నాయకులు 9052642002, లోత రామారావు రాష్ట్ర అధ్యక్షులు 9493838160, 8333862422 నెంబర్లకు సంప్రదించాలని కోరారు. 10వ తేదీ అనంతరం ఉచితంగా అందించబడుతుందని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు సీసం సురేష్, పోడియం లక్ష్మణ్, వీరబోయిన దిలీప్, పాండు నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

ఎగ్జిక్యూటివ్ ఇంజినీరుగా భాస్కరరావు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-సీలేరు : ఎపి జెన్‌కో సీలేరు కాంప్లెక్స్ పరిధి ఈఈ కార్యాలయంలో గురువారం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (సివిల్)గా గంట భాస్కరరావు బాధ్యతలు చేపట్టారు. ఈయన విజయవాడ విద్యుత్ సౌధలో ఏడిఈగా పని చేస్తూ ఈఈగా ఉద్యోగోన్నతిపై సీలేరుకు బదిలీపై వచ్చారు. పస్తుతం ఏపీ జెన్కో సీలేరు కార్యాలయంలో ఈఈగా పనిచేస్తున్న ప్రభాకర్‌ను పోలవరం ప్రాజెక్టుకు బదిలీ చేశారు. బాధ్యతలు చేపట్టిన భాస్కరరావుకు ఈఈ ప్రభాకర్ పుష్పగుచ్ఛం అందజేసి సాలువతో సత్కరించి ఘనంగా సన్మానించారు. అనంతరం ఏడి ఈలు వెంకట మధు, అప్పలనాయుడు, ఏఈ సురేష్, కార్యాలయ సిబ్బంది ఈఈ భాస్కర్‌రావుకు శుభాకాంక్షలు తెలిపారు.

సామాజిక భవనం ప్రారంభం

ప్రజాశక్తి-చింతూరు : జమాల్ ఖాన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో లక్ష రూపాయల వ్యయంతో నిమ్మలగూడెం గ్రామంలో ప్రధాన కూడలి వద్ద ఏర్పాటు చేసిన కమ్యూనిటీ హాల్‌ను ప్రముఖ ఆయుర్వేద వైద్యులు ట్రస్ట్ చైర్మన్ మహమ్మద్ జమాల్ ఖాన్ గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సెక్రటరీ మహమ్మద్ ఇమ్రాన్ ఖాన్, మాజీ సర్పంచ్ సోడె శ్రీను, టిడిపి మండల అధ్యక్షులు ఇలా చిన్నారెడ్డి, సాల్మన్ రాజు, గ్రామ పెద్దలు సోడే భద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

జీవామృతం తయారీపై అవగాహన

ప్రజాశక్తి-కొయ్యూరు : మండలంలోని రేవళ్ల గ్రామంలో పొలంబడి కార్యక్రమంలో భాగంగా జీవామృతం తయారీ, దాని ఆవశ్యకతను గురించి మండల వ్యవసాయ అధికారిని ఉమాదేవి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇది మొక్కలకు ఎంతగానో ఉపయోగపడుతుందని, జీవన పద్ధతిలో పురుగలను నాశనం చేయవచ్చని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ జలుమూరి వెంకటలక్ష్మి, గ్రామ వ్యవసాయ అధికారులు రూప, ఉష, సతీష్ ఎస్‌టిఓ ఆర్గనైజర్ రవికుమార్, రైతులు పాల్గొన్నారు.